నమస్తే తెలంగాణ
రాజన్న సిరిసిల్ల
5 కరీంనగర్, శుక్రవారం 13 డిసెంబర్ 2024 RAJANNA SIRCILLA

# ఎండోమెంట్‌లోకి తీసుకోవద్దు

- వెల్లుల్ల గ్రామస్తుల డిమాండ్
- మెట్‌పల్లి వరకు పాదయాత్ర.. రాస్తారోకో


మెట్‌పల్లిలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 12: తమ ఊరి ఎల్లమ్మ ఆలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకోవద్దని, ఆలయ నిర్వహణను తిరిగి గ్రామానికే అప్పగించాలని వెల్లుల్ల గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వెల్లుల్ల నుంచి పాదయాత్రగా మెట్‌పల్లికి వచ్చి జాతీయ రహదారిపై బైఠాయించారు. సుమారు గంటపాటు రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. ఇటీవల ఎల్లమ్మ ఆలయాన్ని దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ గురువారం గ్రామస్తులంతా సమావేశమయ్యారు. గ్రామానికే చెందిన ముగ్గురు వ్యక్తులు చేసిన ఫిర్యాదు మేరకే ఎల్లమ్మ ఆలయాన్ని దేవాదాయశాఖ పరిధిలోకి తీసుకుందని తెలిపారు. కాగా, నిరసనలో 'ఎండోమెంటు వద్దురా.. యధా విధి ముద్దురా..' 'ఎండోమెంట్ గోబ్యాక్' అంటూ నినాదాలు చేశారు. గంటపాటు నిరసన చేపట్టగా, జాతీయ రహదారికిరువైపులా పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. దీంతో సీఐ నిరంజన్‌రెడ్డి, ఆర్డీవో కార్యాలయాల డీవో చేరుకొని గ్రామస్తులను సముదాయించారు. తమ డిమాండ్‌ను లిఖితపూర్వకంగా ఇస్తే ఉన్నతాధికారులకు పంపి నెరవేర్చేలా చూస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.


బతుకుచిత్రం

బతుకుదెరువు కోసం రాజస్థాన్ నుంచి వలసొచ్చిన ఓ కుటుంబం, కరీంనగరంలోని శివ థియేటర్ సమీపంలో బొమ్మల దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నది. కూతురును ఊయలలో పడుకోబెట్టి తల్లి ఇలా బొమ్మల తయారీలో నిమగ్నమైంది. 'నమస్తే' ప్రతినిధి తీసిన ఈ దృశ్యం, ఇది బతుకుచిత్రానికి అద్దంపడుతున్నది.

**- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్**

# నిద్రలోనే ఆహుతి

ఒకరి సజీవ దహనం


పైకప్పు కూలి దగ్ధమైన ఇల్లు, గాతం తిరుపతి (ఫైల్)

మల్యాల, డిసెంబర్ 12 : ఎప్పటిలాగే నిద్రపోయిన ఆ యువకుడు అనుకోని రీతిలో అగ్నికి ఆహుతయ్యాడు. ఊహించని విధంగా అర్ధరాత్రి ఇంటి పైకప్పు కూలి, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు అంటుకొని మృత్యుఒడికి చేరాడు. మల్యాల ఏఎస్ఐ రుద్ర కృష్ణకుమార్ వివరాల ప్రకారం.. మల్యాల మండలం మ్యాడంపల్లికి చెందిన గాతం తిరుపతి (37) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు గ్రామంలోనే మరోచోట నివసిస్తుండగా, తిరుపతి శిథిలావస్థలో ఉన్న పెంకుటింట్లో ఉంటున్నాడు. రోజువారీలాగానే బుధవారం రాత్రి ఆ ఇంట్లో ఒంటరిగా పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో ఇంటి పైకప్పు కూలడంతో విద్యుత్ వైర్లు తెగి షార్ట్ సర్క్యూట్ అయింది. దీంతో ఇల్లంతా మంటలు చెలరేగాయి. గాఢ నిద్రలో ఉన్న తిరుపతికి అంటుకోవడంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మంటలతోపాటు దట్టమైన పొగ వ్యాపించడంతో చుట్టుపక్కల వారు గమనించి, తల్లిదండ్రులతోపాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులతో పాటు అగ్నిమాపక శాఖ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. అప్పటికే తిరుపతి చనిపోయాడు. తిరుపతి తల్లి దేవమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పాపం పంచాయతీ కార్యదర్శులు!



- కత్తిమీద సాములా ఇందిరమ్మ ఇండ్ల సర్వే
- ఒత్తిడి పెంచిన సర్కారు
- రోజుకు 50 ఇండ్లకుపైగా సర్వే చేయాలని హుకూం
- అన్నీ సవ్యంగా ఉన్నా 20కి మించి చేయలేమంటున్న సెక్రటరీలు
- లబ్ధిదారుల ఎంపిక తమ మెడకు చుట్టుకుంటుందన్న ఆందోళన
- నాలుగు జిల్లాల్లోనూ ఉన్నతాధికారులకు విన్నపాలు
- దాటవేతే తప్ప స్పష్టత కరువు

**పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి 'ముందు నుయ్యి.. వెనుక గొయ్యి' అన్నట్టు తయారైంది. ఇప్పటికే అనేక విధులు, సర్వేలతో సతమతమవుతుండగా, ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల సర్వే పేరిట మరోభారం మోపుతున్నది. ఇబ్బందులు ఎదురైనా వెనుకో ముందో సర్వేను చేసేందుకు సెక్రటరీలు సుముఖత చూపుతున్నా.. లబ్ధిదారుల గుర్తింపు మాత్రం ప్రాణసంకటంగా మారుతున్నది. ఈ నిబంధన వల్ల భవిష్యత్‌లో అనేక సమస్యలు ఉత్పన్నం అవుతాయని, ఎంపిక ప్రక్రియను ఇందిరమ్మ కమిటీలకు అప్పగించాలంటూ ముక్తకంఠంతో చెబుతున్నా సర్కారు మాత్రం ససేమిరా అంటున్నది. మరోవైపు ఇచ్చిన టార్గెట్ పూర్తి చేసేందుకు సమయం ఇవ్వాలని కోరుతున్నా వినిపించుకోకుండా కచ్చితంగా ఈనెల31లోగా కంప్లీట్ చేయాలని మెడపై కత్తి పెడుతున్నది. సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే నుంచి ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్న నేపథ్యంలో మరో సర్వే చేయించడంతోపాటు శక్తికి మించి టార్గెట్ ఇస్తూ ఒత్తిడి చేయడంతో సెక్రటరీలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే సర్వేలో ఎదురయ్యే సమస్యలతోపాటు పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఉమ్మడి జిల్లాలోని ఉన్నతాధికారులకు పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ ఆధ్వర్యంలో విజ్ఞప్తులు, విన్నపాలు చేస్తున్నారు. అయినా ఎవరూ కరుణ చూపడం లేదని వాపోతున్నారు. పైగా క్షేత్రస్థాయి ఇబ్బందులను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా సర్వేకు ఒత్తిడి చేయడంపై లోలోన కుమిలిపోతున్నారు.**

కరీంనగర్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ కమాన్‌పూర్ : కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు శ్రీకారం చుడుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే మొదటి విడుత ప్రతి నియోజకవర్గానికీ 3,500 చొప్పున ఇండ్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాలకు 45,500 ఇండ్లు మంజూరయ్యాయి. లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ఒక ప్రత్యేక యాప్‌ను అమల్లోకి తెచ్చింది. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థల్లో పనిచేసే పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు యాప్ డౌన్‌లోడ్ చేసేందుకు యూజర్ ఐడీలు కేటాయించారు. సర్వే చేసే ఉద్యోగులకు మొయిల్ ఐడీలు రూపొందించి లాగిన్ ఇస్తున్నారు. ఆ అధికారులు ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇండ్లు లేదా ఆ స్థలం వద్దకు వెళ్లి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేయాలి. సదరు దరఖాస్తుదారుడి ప్రస్తుత ఇంటి నివాసానికి సంబంధించిన ఫొటోలు, గోడలతో సహా తీసి అప్‌లోడ్ చేయాలి. అలాగే డాక్యుమెంట్లు తీసుకోవాలి. అలాగే రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ లేదా ఇంటిపన్ను లేదా సాదాబైనామా అయినా సరే తీసుకొని సదరు డాక్యుమెంట్‌ను 5ఎంబీకి కుదించి అప్‌లోడ్ చేయాలి. దరఖాస్తుదారుడి ఫొటోలు, ఇంట్లో బయట తీయడంతోపాటు సదరు వ్యక్తి ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు అర్హుడా.. అనర్హుడా..? కూడా నమోదు చేయాలి. నిజానికి యాప్‌లో సదరు దరఖాస్తుదారుడి పూర్తి వివరాలు నమోదు చేసి సర్వే చేయాలంటే.. ఉదయం ఏడు నుంచి రాత్రి ఏడు గంటల వరకు సర్వే చేసినా అందులో అన్నీ సవ్యంగా ఉంటే 20 మందికి మించి చేయలేమని కార్యదర్శులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం రోజుకు 50కిపైగా చేయాలని ఒత్తిడి తెస్తున్నదని, ఇదెలా సాధ్యమవుతుందని ప్రశ్నిస్తున్నారు. అలాగే, ఒక సెక్రటరీ నిర్ణీత సమయంలో 200 ఇండ్లకు మించి సర్వే చేయలేరని వాపోతున్నారు. ఎక్కువ దరఖాస్తుదారులు, ఇండ్లు ఉన్న గ్రామాల్లో అదనంగా సిబ్బందిని నియమించాలని, వారికి ప్రత్యేకంగా ఐడీలు కేటాయించి సర్వే చేయించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారులకు విన్నవించామని, అయినా తమ మొర అరణ్యరోదనే అవుతున్నదని ఆవేదన చెందుతున్నారు.

### ప్రాణసంకటంగా గుర్తింపు

అష్టకష్టాలు పడైనా సర్వే చేస్తామని చెబుతున్న పంచాయతీ కార్యదర్శుల నుంచి ఒకటి రెండు అంశాలపై మాత్రం బలంగా వ్యతిరేకత కనిపిస్తున్నది. దరఖాస్తుదారుడి వివరాలు సేకరించేందుకు వెళ్లి, అక్కడే ఫొటోలు తీసుకొని సదరు దరఖాస్తుదారు ఇందిరమ్మ ఇంటికి అర్హుడా.. అనర్హుడా..? అన్నది సదరు యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇక్కడే అసలు సమస్య వచ్చి పడుతున్నది. గ్రామంలో ఏ ఒక్కరికి రాకపోయినా సదరు వ్యక్తులంతా భవిష్యత్‌లో పంచాయతీ కార్యదర్శులపై పిర్యాదుల పరంపర కొనసాగించే అవకాశమున్నది. అంతేకాదు, నిలదీతలు, ధర్నాల వంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుంది. దీంతో కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే అర్హులను తేల్చే ప్రక్రియను ఇందిరమ్మ కమిటీలకు అప్పగించాలని ముక్తకంఠంతో సర్కారును కోరుతున్నారు. దీనికి ప్రభుత్వం మాత్రం ససేమిరా అంటున్నది. ఈ విషయంలో భవిష్యత్‌లో తలెత్తే పరిణామాల నేపథ్యంలో కనీసం ఒక పంచాయతీ కార్యదర్శిని మరో పంచాయతీలో సర్వే చేయించాలని కోరుతున్నా విముఖత చూపుతున్నది. దీంతో కార్యదర్శులు వెనుకడుగు వేయాలని ముందుగా నిర్ణయించుకున్నా.. ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి సర్వేను కొనసాగిస్తున్నది. ఈ పరిస్థితుల్లో పరిణామాలు ఎటువైపు దారితీస్తాయోనన్న ఆందోళన వారిలో వ్యక్తమవుతున్నది.



### ఒత్తిడి చేయవద్దు



సర్వే చేయడానికి మేం సిద్ధంగా ఉన్నాం. మా పంచాయతీ కార్యదర్శుల డిమాండ్లను ఉన్నతాధికారుల ముందు పెట్టాం. పరిష్కరిస్తారని ఆశిస్తున్నాం. అయితే లబ్ధిదారులు అర్హులా.. కాదా..? అని తేల్చే ప్రక్రియను మాత్రం ఇందిరమ్మ కమిటీలకు అప్పగించాలని ముక్తకంఠంతో కోరుతున్నాం. ఈ డిమాండ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా ఉంది. అలాగే మా విధులకు భిన్నంగా సర్వేలు చేసినప్పుడు మాకు అదనపు రెమ్యునరేషన్ ఇవ్వాలని కోరుతున్నాం. ఈ విషయంలోనూ అధికారులు ఆలోచించాలి. ప్రధానంగా క్షేత్రస్థాయి పరిస్థితులను అర్థం చేసుకోవాలని వేడుకుంటున్నాం. యాప్‌లో ఉన్న అంశాలను పూర్తి చేసి సమగ్రంగా సర్వేచేయాలంటే రోజుకు 15 ఇండ్లు చేయడమే కష్టం అవుతుంది. మాపై ఒత్తిడి పెంచడం వల్ల ఇబ్బందులు పెరుగుతాయి. దీనిని గుర్తించిన మాకు అన్ని రకాలుగా సహకరించాలని కోరుతున్నాం.

**- జీ అజయ్‌కుమార్, కరీంనగర్ జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు**

### స్పష్టతనివ్వని ఉన్నతాధికారులు

తమపై పని భారం పెరుగుతున్నా సర్వే చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఈ పరిస్థితుల్లో తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నాలుగు జిల్లాల్లోనూ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్లు, ఆయా విభాగాల ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించారు. అందులో ప్రధానంగా కార్యదర్శులకు విధులు, సర్వేలు కేటాయించేటప్పుడు వాట్సాప్ మెసేజ్‌లు, జూమ్ మీటింగ్‌ల ద్వారా కాకుండా ప్రత్యేకంగా సర్క్యులర్ ద్వారా ఆదేశాలివ్వాలని, సెలవు రోజుల్లో సర్వేకు మినహాయించాలని, తప్పనిసరి పరిస్థితుల్లో చేయాల్సివస్తే ఆ సెలవులను తర్వాత వాడుకునే వెసులుబాటు (కంపెన్సేటరీ లీవ్స్) కల్పించాలని, సర్వే చేసినందుకు తగిన పారితోషికం ఇవ్వాలని కోరారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల కోసం పంచాయతీలకు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చినందున తగినంత సమయం ఇవ్వాలని, టార్గెట్లు పెట్టి ఇబ్బంది పెట్టరాదని, ఇండ్ల అర్హుల గుర్తింపు ఇందిరమ్మ గ్రామస్థాయి కమిటీలకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. జేపీఎస్‌ల నాలుగేళ్ల ప్రొబెషనరీ కాలాన్ని సర్వీస్ కాలంగా పరిగణించాలని, ప్రమోషన్ వంటి అంశాలకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, గ్రామపంచాయతీ నిర్వహణ ఖర్చుల భారం మొత్తం కార్యదర్శులు భరిస్తున్నందున ప్రభుత్వం వెంటనే స్పందించి జీపీలకు రావాల్సిన నిధులను విడుదల చేయాలని విన్నవించారు. నిజానికి మెజార్టీ డిమాండ్లు పరిష్కరించే అధికారం జిల్లా ఉన్నతాధికారుల చేతుల్లో ఉన్నా, ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. డిమాండ్లపై ఎటువంటి స్పష్టతనివ్వకుండా సర్వే చేసి తీరాల్సిందేనంటూ ఒత్తిడి చేస్తుండడంతో కార్యదర్శులు మానసికంగా కుంగిపోతున్నారు.

# పోరాటం ఉధృతం


సిరిసిల్ల అర్బన్ మండలం రగుడు జంక్షన్ వద్ద రిలేదీక్షలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

- మూడో రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె
- ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్
- లేకుంటే ఆందోళన విరమించేది లేదని స్పష్టీకరణ

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల పోరాటం ఉధృతమవుతున్నది. ఇప్పటికే చేపట్టిన దీక్షలు గురువారం మూడోరోజుకు చేరుకున్నాయి. ఉద్యోగులంతా సమ్మె చేస్తుండడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సేవలు నిలిచిపోయాయి. సిరిసిల్లలో వంటా వార్పు చేపట్టి నిరసన తెలిపారు. కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలో ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. జగిత్యాలలో దీక్షలకు పీఆర్‌టీయూ-టీఎస్, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్, విశ్రాంత ఉద్యోగుల సంఘం, టీపీటీఎఫ్ నాయకులతో పాటు పలువురు మద్దతు ప్రకటించారు. పెద్దపల్లిలో ఎంఆర్‌సీ ఆఫీస్ ఎదుట మూడు రోజులుగా దీక్షలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి వరంగల్‌లో ఇచ్చిన మాట ప్రకారం తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చి ఏడాది గడిచినా ఏ ఒక్కటీ నెరవేర్చలేదని మండిపడ్డారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, లేదంటే పోరాటాన్ని విరమించేది లేదని స్పష్టం చేశారు. కరీంనగర్‌లో సమ్మెకు పీఆర్టీయూ తెలంగాణ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, టీపీటీఎఫ్ సీనియర్ నాయకుడు పోరెడ్డి దామోదర్ రెడ్డి, పీఆర్‌పీవో తెలంగాణ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మండల ఆనందం మద్దతు తెలిపి మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు మినిమం టైమ్ స్కేల్, జీవిత బీమా, హెల్త్ కార్డులు, ఇతర ప్రభుత్వ మహిళా ఉద్యోగుల మాదిరిగా అన్ని రకాల సెలవులు ప్రభుత్వం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్, డిస్ట్రిక్ జనరల్ సెక్రెటరీ తిరుపతి, పీఆర్టీయూ తెలంగాణ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతిరి తిరుపతిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండల ఆనందం సందర్శించి మద్దతును తెలిపారు.



### ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన మాటను నెలబెట్టుకోకోవాలి. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని చెప్పి ఇప్పుడు మొఖం చాటేస్తున్నారు. చాలీచాలని జీతం, అదనపు పని భారంతో మానసికంగా ఒత్తిడికి గురవుతున్నాం. మాకు పే స్కేల్ అమలు చేయాలి. ప్రభుత్వోద్యోగులతో సమానంగా పని చేస్తున్నాం. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తాం.

**- కే జ్యోతి, స్పెషల్ ఆఫీసర్, కేజీబీవీ (ఓదెల)**



### మాకు న్యాయం చేయాలి

'సమగ్ర శిక్ష'ను విద్యాశాఖలో విలీనం చేయాలి. మాకు పనికి తగ్గ వేతనం ఇవ్వాలి. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. కానీ, ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదు. గెలవక ముందు ఒకలా.. గెలిచాక మరోలా వ్యవహరిస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. మా డిమాండ్లను నెరవేర్చి న్యాయం చేయాలి.

**- కే సుప్రజ, సీఆర్‌పీ, జడ్పీహెచ్ఎస్, గుంజపడుగు (మంథని)**


కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట దీక్షలో సమగ్ర శిక్ష ఉద్యోగులు


వివాహ ఘట్టంలో వధూవరులు మేఘన - కొమురయ్య

# ఊరోళ్లే పెళ్లి పెద్దలు

జగిత్యాల రూరల్, డిసెంబర్ 12 : ఆ యువతి పెళ్లికి ఊరోళ్లే పెద్దలుగా మారారు. పేదరికంలో ఉన్న ఆమె వివాహానికి అండగా నిలిచి, పెళ్లిని ఘనంగా జరిపించారు. పూర్తి వివరాలిలా ఉన్నాయి. జగిత్యాల రూరల్ మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన ఎడ్ల రమేశ్-కళ దంపతులది నిరుపేద కుటుంబం. వారి కూతురు మేఘన వివాహం ధర్మపురికి చెందిన కొమురయ్యతో నిశ్చయమవగా, నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్తులు అండగా నిలిచారు. ₹2.50 లక్షలు పోగు చేసి, పెళ్లి పెద్దలుగా మారి వైభవంగా వివాహం జరిపించారు. గ్రామస్తులు సాయం చేసినందుకు యువతి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిలపారు. పేదింటి అమ్మాయి పెళ్లికి అండగా నిలిచిన గ్రామస్తులను పలువురు ప్రశంసించారు.

# మొక్కలు తొలగించినందుకు ₹9 వేల జరిమానా

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 12: ఉపాధి హామీ కింద నాటిన మొక్కలను తొలగించిన ఓ రైతుకు పంచాయతీ అధికారులు ₹9 వేల జరిమానా విధించారు. మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ శివారులోని వెల్లుల్లకు చెందిన రైతు అల్లూరి ధనుంజయ్ తోట వద్ద రోడ్డు పక్కన ఉపాధి హామీ కింద మొక్కలు నాటారు. అయితే, ఆ రైతు మొక్కలను తొలగించడంతో గురువారం జరిమానా విధించినట్టు పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ తెలిపారు.


హాజరైన మత్స్య సహకార సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు సభ్యులు

# చేప పిల్లలు వద్దు.. డబ్బులు ఇవ్వండి

- మత్స్యకారులకు ప్రత్యేక పింఛన్లు మంజూరు చేయండి
- సర్వసభ్య సమావేశంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యుల డిమాండ్


మాట్లాడుతున్న మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ టీ విజయభారతి

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 12 : ప్రభుత్వం పంపిణీ చేస్తున్న చేపపిల్లల్లో నాణ్యత లేదని, వాటికి బదులుగా సొసైటీల బ్యాంకు ఖాతాలో సబ్సిడీ డబ్బులు జమ చేయాలని అధికారులను కరీంనగర్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లాకేంద్రంలోని వాసర గార్డెన్‌లో గురువారం జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పిట్టల రవీందర్ అధ్యక్షతన సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ, ప్రభుత్వం చేప పిల్లలకు బదులుగా డబ్బులు ఇస్తే ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి, చెరువులో వేసుకుంటామని చెప్పారు. వీణవంక మండలంలోని ఒకే గ్రామంలో రెండు సంఘాలు ఏర్పాటు చేయడం సరికాదని, గ్రామానికి ఒకటే ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు చేపపిల్లలు ఎందుకు పంపిణీ చేయలేదని నిలదీశారు. మత్స్య కారులకు ప్రత్యేకంగా పింఛన్లు ఇప్పించాలని, చెరువులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలోని ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సభ్యులకు నేషనల్ ఫిష్ డెవలప్ ఫెడరేషన్ (ఎన్ఎఫ్‌డీపీ)ద్వారా గుర్తింపు కార్డులు జారీ కోసం సభ్యులు సహకారం అందించాలని జిల్లా అధ్యక్షుడు పిట్టల రవీందర్ కోరారు. మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ టీ విజయ భారతి మాట్లాడుతూ, సొసైటీ రికార్డుల నిర్వహణపై, జిల్లాలలోని ప్రతి ప్రాథమిక సహకార సొసైటీ మూడు నెలలకు ఒక సారి కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయాలని, ప్రతి ఆరు నెలలకు ఒకసారి సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ మెనేజింగ్ డైరెక్టర్ జీ మంజుల, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెసరు కుమారస్వామి, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.